సాక్షి
బాపట్ల
శుక్రవారం । 5 । జనవరి । 2024



హాస్టల్‌ను పరిశీలించిన జేసీ

నెహ్రూనగర్: గుంటూరులోని జీసీ కళాశాల బాలికల వసతి గృహ ప్రాంగణంలోని బాలికల వసతి గృహాన్ని, మునిసిపల్ ప్రైమరీ స్కూలును జేసీ జి.రాజకుమారి గురువారం సందర్శించారు.



'స్మృతివనం' ఏర్పాట్లు

విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని 'మున్సిపల్' స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,036, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఎస్పీతో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ భేటీ



నరసరావుపేట: ఏపీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జెల్లా సుదర్శనరెడ్డి గురువారం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పల్నాడు జిల్లాలో కేసుల గురించి ఇద్దరూ చర్చించారు. ఆయనతో స్థానిక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుచ్చిదంతాచారి, సీనియర్ ఏపీపీ ఎల్.లక్ష్మీరామ్ నాయక్, అదనపు పీపీ స్వర్ణలత భాను, ఏపీపీ ఎస్. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

7న అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకాంలో కనీసం 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌లలో ఒక అర్హత ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ మార్కుల జాబితా, సర్టిఫికెట్లతో శనివారం కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఆర్టీవోలకు శిక్షణ



తెనాలి రూరల్: నూతనంగా రవాణా శాఖ అధికారులుగా ఎంపికైన వారికి తెనాలిలో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గతేడాది అక్టోబరులో మనోహర్ (అనకాపల్లి), భరత్ (రాయచోటి) ఆర్టీవోలుగా ఎంపికయ్యారు. వీరు నెలరోజుల పాటు శిక్షణలో భాగంగా గుంటూరు జిల్లాకు వచ్చారు. అందులో తెనాలి ఆర్టీవో కె. ప్రసాద్ ఆధ్వర్యంలో వీరికి శిక్షణ ఇచ్చారు. వాహన పత్రాలు పరిశీలించడం, రవాణా , ప్రైవేటు వాహనాలకు ఉన్న వేర్వేరు నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థల వాహనాలు నడిపై వారికి ఏ విధమైన నిబంధనలు వర్తిస్తాయో వివరించారు. విద్యాసంస్థల వాహనాలు నడిపే వారి వయసు 60 ఏళ్లలోపు ఉండాలని, కనీసం ఐదేళ్ల రవాణా వాహనాలు నడిపిన అనుభవం ఉండాలని ఆర్టీవో ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే తీరును ఎంవీఐ టి. రాఘవరావు వివరించారు.

పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు

గుంటూరు మెడికల్: జిల్లా క్షయ నివారణ విభాగంలో పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, దరఖాస్తుల పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థుల మార్కులు, రూల్ ఆఫ్ రిజ్వేషన్ ప్రకారం మాత్రమే కలెక్టర్ ఆధ్వర్యంలో నియామక ఉత్తర్వులు ఇస్తామన్నారు. ఉద్యోగాల భర్తీపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు. ఎవరూ ప్రలోభాలకు లొంగి దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

జిల్లా జైలును సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



పట్నంబజారు: ఐపీఎస్‌కు ఎంపికైన ఐదుగురు ట్రైనీ అధికారులు గురువారం ట్రైనింగ్‌లో భాగంగా జిల్లా జైలును సందర్శించారు. జిల్లా జైలు అధికారులతో కలిసి ప్రాంగణమంతా తిరిగారు. జైలు వాతావరణాన్ని అడిగి తెలుసుకున్నారు. కారాగార కార్యకలాపాలు, ముద్దాయిలకు సౌకర్యాలు, న్యాయ సహాయ వివరాలు, కారాగార పాలన తదితర విషయాలపై జైలు సూపరింటెండెంట్ కె.రఘు వివరించారు. సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా జైలు వైద్య అధికారి కె.లక్ష్మీపూర్ణలత, జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్.కిరణ్, డెప్యూటీ జైలర్లు ఎ.కళ్యాణ్ బాబు పాల్గొన్నారు.

పేదల ప్రాణాలకు పెద్దదిక్కు

యువకుడి ఆరోగ్యానికి భరోసా

ఈ ఫొటోలో కిడ్నీ వైద్యులతో కనిపిస్తున్న యువకుడి పేరు చిత్తజల్లు సందీప్. మచిలీపట్నానికి చెందిన ఇతనికి కిడ్నీలు పాడయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు నవంబరులో చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్చారు. వైద్యులు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గత ఏడాది డిసెంబర్ 19న విజయవంతంగా దాన్ని చేశారు. సందీప్ తల్లి పద్మావతి కిడ్నీ దానం చేయడంతో, సుమారు రూ. 10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్ పూర్తి ఉచితంగా చేశారు. అది విజయవంతమవ్వడంతో డిసెంబర్ 28న ఆస్పత్రి నుంచి సందీప్‌ను డిశ్చార్జి చేశారు.



వైద్యులతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న సందీప్

పేద గుండెకు అండ

ఈ ఫొటోలో వైద్యులతో పాటు కనిపిస్తున్న వ్యక్తి పేరు అంకమ్మరావు. మేడికొండూరు మండలం మందపాడు స్వగ్రామం. గత ఏడాది డిసెంబర్ 1 గుండెనొప్పితో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా, అక్కడ పరీక్షించిన వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు యాంజియోగ్రామ్ చేశారు. బైపాస్ సర్జరీ చేయాలని నిర్ధారించారు. ప్రముఖ గుండె మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే సారథ్యంలో జీజీహెచ్ సీటీఎస్ వైద్య బృందం డిసెంబర్ 19న బైపాస్ సర్జరీ చేసింది. అంకమ్మరావు ఆరోగ్యంగా ఉండటంతో డిసెంబర్ 28న ఇంటికి పంపించారు.



గుండె బైపాస్ సర్జరీ చేయించుకున్న అంకమ్మరావు

- కార్పొ'రేటు' ఆస్పత్రులకు దీటుగా గుంటూరు జీజీహెచ్‌లో వైద్యసేవలు
- ఉచితంగా సూపర్‌స్పెషాలిటీ, గుండె బైపాస్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు
- ఏడాదిలో 13,04,974 మందికి వైద్యం, 28,858 ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాసుపత్రిగా గుంటూరు జీజీహెచ్ పేరు గడించింది. సుమారు ఎనిమిది జిల్లాలకు చెందిన రోగులు వస్తున్నారు. అత్యంత అరుదైన, అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లకు వేదికగా మారింది. ఎందరో పేద రోగుల ప్రాణాల్ని ఈ ఏడాది జీజీహెచ్ వైద్యులు కాపాడి ప్రాణదాతలుగా నిలిచారు. 2023లో 13,04,974 మంది రోగులు వైద్యసేవలు పొందారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజూ 2వేల నుంచి 3వేల మంది రోగులు అవుట్ పేషేంట్ విభాగంలో వైద్యసేవల్ని పొందుతున్నారు. చికిత్సకు వచ్చే రోగుల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియలో సైతం జీజీహెచ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కడైనా రోగులు తక్షణమే కేస్ షీట్‌లతో పని లేకుండా చికిత్స పొందవచ్చు.



జీజీహెచ్‌లో ఓపీలో క్యూలో నిలుచున్న రోగులు(ఫైల్)

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతమే లక్ష్యంగా అనేక విప్లవాత్మక మార్పులు వైద్య రంగంలో తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రికి లేని విధంగా గుంటూరు జీజీహెచ్‌కు రూ. 25 కోట్ల ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరాన్ని, రూ. 4 కోట్లు ఖరీదు చేసే సీటీ స్కాన్ వైద్య పరికరాన్ని మంజూరు చేశారు. వైద్య పరికరాలతో పాటు పలు భవన నిర్మాణాల కోసం కోట్లాది రూపాయల్ని ప్రభుత్వం మంజూరు చేసింది.

క్యాన్సర్‌కు ఆన్సర్

జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యంత అరుదైన క్యాన్సర్ ఆపరేషన్లు చేస్తూ ఉచితంగా మందులు సైతం అందిస్తున్నారు. అరుదైన వ్యాధుల్ని గుర్తించటంతో పాటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేయలేని అత్యంత అరుదైన సర్జరీలు చేస్తూ జీజీహెచ్ వైద్యులు పేదల మన్ననలు పొందుతున్నారు. రేడియాలజీ వైద్య విభాగంలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్సరే, మెమోగ్రామ్ వైద్య పరీక్షలు, పెథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రి ల్యాబ్‌లలో పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. నాణ్యమైన ఆహారాన్ని సైతం డైట్ ద్వారా రోగులకు ఉచితంగా అందిస్తున్నారు.

అన్నీ ఉచితమే...

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆసుపత్రుల కంటే దీటుగా సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవల్ని పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే సహకారంతో కార్డియో థొరాసిక్ సర్జరీ వైద్యులు విజయవంతంగా గుండె బైపాస్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. వీటితో పాటు కిడ్నీ మార్పిడి, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, మానసిక వ్యాధుల వైద్యవిభాగాల్లో ఉచితంగా సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య సేవల్ని అందిస్తున్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో భరోసా

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఉచితంగా చేస్తూ , కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకునేందుకు భయపడే అత్యంత క్లిష్టమైన కేసుల్ని సైతం అడ్మిట్ చేసుకుని ప్రాణాలు కాపాడేందుకు జీజీహెచ్ వైద్యులు 24 గంటలు చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. ఈ ఏడాదిలో పలు అత్యాధునిక వైద్య పద్ధతుల్లో ఆపరేషన్లు చేసి రాష్ట్ర వైద్య చరిత్రలో రికార్డు సృష్టించారు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

రికార్డు స్థాయిలో వైద్యసేవలు

- ఓపీ విభాగంలో గత ఏడాది 12,34,855 మంది సేవలందుకున్నారు. వీరిలో పురుషులు 5,12,776 మంది, స్త్రీలు 7,92,000 మంది, ట్రాన్స్ జెండర్స్ 198 మంది ఉన్నారు.
- ఓపీలో పరీక్షలు చేసి అవసరమైన వారిని ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుని వైద్య సేవల్ని అందిస్తున్నారు. గత ఏడాది ఇన్‌పేషెంట్ విభాగంలో 70,119 మంది రోగులు వైద్యసేవల్ని పొందారు. ఇందులో 32,285 మంది పురుషులు, 37,830 మంది స్త్రీలు, నలుగురు ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు.
- గత ఏడాది 28,858 ఆపరేషన్లు చేసి వైద్యులు రోగుల ప్రాణాలు కాపాడారు.
- గత ఏడాది ఎందరో శిశువులు జీజీహెచ్‌లో వెలుగు చూశారు. పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణులకు సాధారణ కాన్పు/ ఆపరేషన్లు 7,070 చేశారు.





కొల్లూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న సమన్వయకర్త వరికూటి అశోక్



రేపల్లెలో పింఛన్లు అందజేస్తున్న సమన్వయకర్త ఈవూరి గణేష్



బల్లికురవలో పింఛన్లు అందిస్తున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

అవ్వాతాతల్లో పింఛనోత్సాహం

పింఛన్ నగదు పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. మనస్సున మారాజు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అంటూ వేనోళ్లా కొనియాడుతున్నారు. పండగ వాతావరణంలో నియోజకవర్గ సమన్వయకర్తలు లబ్ధిదారులకు నగదును పంపిణీ చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు.

టీడీపీ ఫీట్లు.. అభ్యర్థుల సిగపట్లు

ఆత్మరక్షణలో తెలుగుదేశం అధిష్టానం

- పశ్చిమ, తూర్పులో అభ్యర్థుల కోసం వెతుకులాట
- పశ్చిమానికి మాజీ ఐఏఎస్ అధికారిణితో సంప్రదింపులు
- ఆ సీటు మాకే కావాలంటున్న జనసేన
- సీటు కోసం బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ప్రయత్నం
- ఎంపీ అభ్యర్థి కోసం గాలింపు
- డబ్బున్న అభ్యర్థుల కోసం గాలం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడింది. వైఎస్సార్ సీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జుల మార్పుతో అప్పటి వరకూ అనుకున్న అభ్యర్థుల స్థానంలో కొత్తవారిని వెతుక్కునే పనిలో పడింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని తీసుకుంటే అక్కడ పదిరోజుల కిందట వరకూ ఇన్‌చార్జిగా ఉన్న కోవెలమూడి రవీంద్రతో పాటు ఎన్ఆర్ఐలు ఉయ్యూరు శ్రీనివాస్, మన్నవ మోహనకృష్ణ గట్టిగా ప్రయత్నాలు చేశారు. కార్యక్రమాల నిర్వహణలో కోవెలమూడి రవీంద్రకు, ఎన్ఆర్ఐ ఉయ్యూరు శ్రీనివాస్ మధ్య విభేదాలు రోడ్డెక్కాయి. మరోవైపు తెనాలి సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఇచ్చి, నాదెండ్ల మనోహర్‌ను పోటీ పెడితే అక్కడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గుంటూరు పశ్చిమానికి పంపుతారన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన ఇప్పటికే సమయానుకూలంగా గుంటూరు పశ్చిమంలోనే పెద్దఎత్తున తన అనుచరులతో ఫ్లెక్సీలు కూడా పెట్టించుకున్నారు.

పునరాలోచనలో అధిష్టానం

గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా మంత్రి విడదల రజనీని వైఎస్సార్ సీపీ ప్రకటించగానే తెలుగుదేశం అధిష్టానం ఈ సీటు విషయంలో పునరాలోచనలో పడింది. ఆమెకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రారంభోత్సవానికి ముందే కార్యాలయంపై నేతలు దాడులకు తెగబడ్డారు. మరోవైపు ఆమెపై పోటీగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణిని రంగంలోకి దింపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అయితే, ఆమె డబ్బు ఖర్చు పెట్టే విషయంలో వెనుకంజ వేస్తుండటంతో నచ్చచెప్పే పనిలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సీటును పొత్తులో తమకే కేటాయిస్తారంటూ జనసేన ఆశలు పెట్టుకుంది. గతంలో జనసేన తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తనకు సీటు కావాలంటూ గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా హామీ ఇచ్చారంటూ ఆయన నియోజకవర్గంలో పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో తెలుగుదేశం, జనసేన మధ్య గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎవరికి సీటు ఇచ్చినా మరొకరు సహకరించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

తూర్పులో తేలని అభ్యర్థి

గుంటూరు తూర్పులో ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె, విద్యావంతురాలు అయిన నూరీ ఫాతిమాను వైఎస్సార్ సీపీ ప్రకటించింది. ఇక్కడ కూడా తెలుగుదేశం పార్టీకి సరైన అభ్యర్థి దొరకడం లేదు. ఇంచార్జిగా ఉన్న నసీర్ అహ్మద్ బదులుగా కొత్తవారిని దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వివిధ కేసుల్లో ఇరుక్కున్న ముజీబ్, అర్బన్ అధ్యక్షుడిగా ఉన్న డేగల ప్రభాకర్ సీటు కోసం తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. అయితే, కొత్త వ్యక్తి కోసం తెలుగుదేశం పార్టీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

శ్రావణ్‌కుమార్‌కు మొండిచెయ్యి

తాడికొండలో కూడా అభ్యర్థిని మార్చేపనిలో టీడీపీ నేతలు బిజీగా ఉన్నారు. జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్‌కు కూడా సీటు దక్కే సూచనలు కనపడటం లేదు. గుంటూరు ఎంపీగా ఉన్న గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి దూరంగా ఉండటంతో ఆయన స్థానంలో కొత్తవారి కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఆలపాటి రాజేంద్రప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర వంటి సీనియర్లు పోటీ చేయడానికి విముఖత చూపిస్తున్నారు. దీంతో నగరానికి చెందిన విద్యాసంస్థల అధినేతను సంప్రదిస్తున్నట్లు సమాచారం. అయితే, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ. 30 నుంచి రూ. 40 కోట్లు, ఎంపీ అభ్యర్థికి రూ. 100 కోట్లు చూపించాలని చెబుతుండటంతో ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఒకవైపు మేమే గెలుస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నా, పోటీకి అభ్యర్థులు దొరకకపోవడంతో తెలుగుదేశం అధిష్టానంలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కడుపుమంటతోనే రజినీపై అసత్య ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బూసిరాజ లత. వేదికపై మహిళా నేతలు

- బీసీ మహిళకు సీటు ఇస్తే ఓర్వలేకపోతున్నారు
- మంత్రి విడదల రజిని ఓటు దరఖాస్తుపై అసత్యప్రచారాలు
- సొంతింటి అడ్రస్‌తో ఓటు కోసం దరఖాస్తు చేస్తే ఖాళీ స్థలం చూపారంటూ పిచ్చి ఆరోపణలు
- టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ మహిళా నేతలు, కార్పొరేటర్ల ఆగ్రహం

పట్నంబజారు(గుంటూరు): టీడీపీ నేతలు నీతిలేని రాజకీయాలు చేస్తున్నారని, దమ్ముంటే నేరుగా వచ్చి చేయాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, పార్టీ మహిళ విభాగం నేతలు మండి పడ్డారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీని రాజకీయంగా ఎదుర్కోలేక టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ధాటికి తట్టుకోలేరని హెచ్చరించారు. గుంటూరు జిల్లా కొరిటెపాడు ప్రధాన రహదారిలోని వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం కార్పొరేటర్లు బూసిరాజ లత, బోడపాటి ఉషారాణి, మల్లిబోయిన శ్రీవల్లి, ఉడుముల లక్ష్మి, ఎక్కలూరి మారుతి, వంగల హేమలతారెడ్డి, పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బూసిరాజ లత మాట్లాడుతూ మంత్రి విడదల రజిని ఓటు దరఖాస్తుపై టీడీపీ నాయకులు పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. అసత్య ప్రచారాలు వారి డీఎస్ఏలోనే ఉన్నాయని దుమ్మెత్తి పోశారు. మంత్రి విడదల రజినీని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన రోజు నుంచి టీడీపీకి నిద్ర పట్టడం లేదన్నారు. ఆమెపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ మండి పడ్డారు. మంత్రి కార్యాలయంపై దాడి చేయడం, ఆమె ఓటు దరఖాస్తుపై అసత్య ప్రచారం చేయడం.. ఇవన్నీ టీడీపీ నాయకుల దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మంత్రి విడదల రజినీకి టీడీపీ నాయకుల్లా తప్పుడు రాజకీయాలు చేయడం తెలియదని వివరించారు. ఖాళీ స్థలం చూపించి ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారం చూస్తుంటే 'నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు' అన్నట్లు ఉందని ఆమె ఎద్దేవా చేశారు. శ్యామలానగర్ 2వ లైన్ సాయి గ్రాండ్ అపార్టుమెంట్ మొదటి అంతస్తు ఫ్లాట్ నంబరు 101ని మంత్రి కొనుగోలు చేశారని, కొన్ని నెలల కిందట గృహ ప్రవేశం కూడా పూర్తయిందని చెప్పారు. అదే అపార్టుమెంట్ అడ్రస్ ఇచ్చి మంత్రి ఓటు కోసం నమోదు చేశారని, దీనికి అన్ని ఆధారాలూ ఉన్నాయని మీడియాకు చూపించారు. పచ్చి అబద్ధాలతో పబ్బం గడపాలని చూస్తే టీడీపీ నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో వారికి ఓటమి తప్పదని తెలిపారు.

పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు

అధికారులకు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశం

బాపట్ల: ఎన్నికల కమిషన్ నిబంధనల్ని అనుసరించి పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారుల్ని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కళాశాల భవనాన్ని ఆయన గురువారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను పటిష్టంగా భద్రపరచాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సిబ్బందికి చెప్పారు. నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లకు భద్రత కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్ పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

క్లుప్తంగా

యార్డుకు 55,013 బస్తాల మిర్చి



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 55,013 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,966 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,700 నుంచి 23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 35,748 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు

యువకుడి ప్రాణం తీసిన పొగమంచు

రోడ్డు కనిపించక ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని...



మృతుడు రాజు

తాడికొండ: పొగమంచు యువకుడి ప్రాణాలు హరించింది. బడేపురం శివారు నిడుముక్కల రోడ్డు వద్ద లారీని ఢీకొని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన కొయ్యలమూడి రాజు (30) అచ్చంపేట ఇసుక రీచ్‌లో ఇన్‌చార్జిగా పనిచేస్తుంటాడు. పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా తెల్లవారు జామున పొగమంచు కమ్మి ఉండటంతో ఎదురుగా వస్తున్న లారీ కనిపించక బలంగా ఢీకొట్టడంతో ఘటనా స్థలంలో అచేతనంగా పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబంలో ఒక్కడే కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

ప్రజారంజక పాలకుడిగా సీఎం జగన్ నిలిచిపోతారు..

అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త హనిమిరెడ్డి



బల్లికురవలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హనిమిరెడ్డి, పింఛన్‌దారులు

బల్లికురవ: అర్హులందరికీ సచివాలయ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిదేనని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ పింఛన్ కానుక నూతన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు రాష్ట్రంలో రూ.1000లు పింఛన్ 39 లక్షల మందికి ఇచ్చారని, అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియక పడిగాపులు కాసేవారన్నారు. నేడు ఆ పరిస్థితులు లేవని సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో 67 లక్షల మందికి ఒకటో తేదినే అందించటం ద్వారా అవ్వా, తాతల ఆనందానికి అవధులు లేవన్నారు. జగనన్న హామీల అమలుతో సేవ చేసే సీఎంగా గుర్తింపు పొందారన్నారు. గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు పట్టణాల్లోని వైద్యులను గ్రామాలకు రప్పిస్తూ జగనన్న ఆరోగ్య సురక్షతో ఆదుకుంటున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారన్నారు. తనను అద్దంకి ప్రజలకు సేవ చేసేందుకే ఇక్కడకు పంపారని 20 రోజులుగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలు తనను కుటుంబ సభ్యుడిగా భావించి అభిమానం చూపుతున్నారని చెప్పారు. తాను అద్దంకి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ప్రకటించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటుతో ఆశీర్వదించాలన్నారు. నూతనంగా మంజూరైన 79 పింఛన్‌ల పంపిణీతో పాటు పింఛన్ పెంపులో భాగంగా లబ్ధిదారులతో కలిసి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహశీల్దార్ కె. రవిబాబు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, ఎంపీటీసీ సభ్యురాలు టి.రాహేలు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఇప్పల అయ్యప్పరెడ్డి, బాపట్ల జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కె.అంజనీ ప్రసాదరెడ్డి, వల్లాపల్లి, బల్లికురవ, కేవీ పాలెం, కె రాజుపాలెం, సొసైటీల అధ్యక్షులు మంచాల శ్రీనివాసరెడ్డి, గుర్రం రంగారావు, దర్శి రామకృష్ణారావు, ఒంగోలు సబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు జే.మాతయ్య, జేసీఎస్ అధ్యక్షుడు టి. నరేష్, స్థానిక నేతలు కట్టా సుధాకర్, ఈర్తినేని పెద్దన్న, మాదాల శివన్నారాయణ, ఇప్పల చిన నాసనరెడ్డి, షేక్ శ్రీనువలి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దేశంలోనే రూ.3వేలు పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం జగనన్నదే
- మాట తప్పని, మడమ తిప్పని నేత సీఎం జగన్
- ప్రభుత్వ విప్ పీఆర్కే



మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3వేలు అందించి మాట తప్పని, మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పెరిగిన పింఛన్‌ల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తూ పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాడని, పెన్షన్‌ను పెంచటమే కాకుండా అర్హులందరికీ సంతృప్తి స్థాయిలో లబ్ధి చేకూరేలా పింఛన్‌ల సంఖ్యను పెంచిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గత సీఎం చంద్రబాబు పాలనలో ఇదే రాష్ట్రంలో ఇంతే బడ్జెట్, నిరుపేదలు అదే సంఖ్యలో ఉన్నా మేలు చేయాలన్న ఆలోచన ఆయనకు రాలేదు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇవాళ జగనన్న అర్హులందరికీ సంక్షేమ పథకాలందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో అవ్వ, తాతలకు పింఛన్ పెంచుకుంటూ రూ.3వేలు చేస్తానని చెప్పి అమలు చేసిన ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. ఒక్క మాచర్ల మండలంలో 63900 మంది లబ్ధిదారులకు రూ. 250కోట్లు నేరుగా వారికి అందజేస్తున్నారని, దీనిలో అమ్మ ఒడి ద్వారా 6055 మందికి రూ.83.90కోట్లు జగనన్న వసతి దీవెన ద్వారా 1948 లబ్ధిదారులకు రూ.4.56కోట్లు, జగనన్న విద్యా దీవెన 3535 మందికి రూ.10.32కోట్లు, వైఎస్సార్ రైతు భరోసా 8582 మందికి రూ.32.19కోట్లు, సున్నా వడ్డీ పంట ఋణాలు 2741 రూ.1.41కోట్లు, పంటల బీమా 3465 రూ. 3.65కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ 1012కి రూ.1.12కోట్లు, మత్స్యకార భరోసా 95 మంది లబ్ధిదారులకు రూ.68లక్షలు, వైఎస్సార్ పింఛన్ కానుక 8103 మందికి రూ. 60.68కోట్లు, వైఎస్సార్ చేయూత 3342 లబ్ధిదారులకు రూ.10.32కోట్లు, వైఎస్సార్ ఆసరా 9765 మందికి రూ.20.53కోట్లు, ఇవేకాకుండా వైఎస్సార్ బీమా, కాపునేస్తం, నేతన్న నేస్తం, జగనన్న తోడు, వాహన మిత్ర, అర్చక, పాస్టర్, మౌజమ్‌లకు ఆర్థిక సాయం, వైఎస్సార్ ఈబీసీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీల ద్వారా వందలాది కోట్ల రూపాయలు పేదల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. గ్రామాలలో ప్రజలకు నేరుగా సేవలందించేందుకు గృహ నిర్మాణాల కోసం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, ఇళ్ల స్థలాల కోసం రూ. 352కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద మంగమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీలు మండ్లి పెదమల్లు స్వామి, శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత, కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరికట్ల చంద్రారెడ్డి, ఓరుగంటి చిన్నా, ముక్కా గురవయ్య, జూకూరి వెంకట్రామయ్య, బట్టు భూషయ్య, రంగా నాయక్, శ్రీనివాసరెడ్డి, రవినాయక్, బూడిద సైదులు, ఎంపీడీఓ సరోజనీదేవి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు



పొలాలను సందర్శించిన ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామచంద్రరావు

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు పండించడం ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా భూసారం పెరిగి పర్యావరణ కాలుష్యం ఉండదని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామచంద్రరావు అన్నారు. గురువారం స్థానిక మట్టుపల్లి సాంబశివరావు వ్యవసాయ క్షేత్రంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పొలంలో అంతర పంటగా ఉన్న ఉల్లి, క్యారెట్, ముల్లంగి, బంతి, ఆముదం పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో మిరప పండించిన రైతు మొదటగా 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి పొలంలో చల్లడం జరిగిందని 45 రోజుల తరువాత భూమిలో కలియ దున్నాలన్నారు. ఒక ఎకరం పొలానికి 500 కేజీల ఘనజీవామృతం వేసి మిరప నారును బీజామృతంతో నారు శుద్ధి చేసి నాటాలన్నారు. అంతర్ పంటలు వేసుకోవడం వల్ల జీవ వైవిధ్యం పెరిగి పురుగులు, తెగుళ్లు ఆశించకుండా ఉంటాయన్నారు. విత్తనాలు నాటిన 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతాన్ని పారించటం మిరప పంటపై వచ్చు తెగుళ్లు పురుగు కోసం పేడ మూత్ర ఇంగువ ద్రావణం, దశపర్ణి, అగ్నిస్త్రం, కోడిగుడ్డు నిమ్మరస ద్రావణం పంచగవ్య కషాయాలను స్ప్రే చేస్తే ప్రయోజనముంటుందన్నారు. ప్రతి రైతు తనకున్న పొలంలో కొంత భాగమైన ప్రకృతి వ్యవసాయం చేసి తమ వంతుగా పర్యావరణానికి మేలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పొలాలు పురుగుమందులు వాడిన పొలాల మధ్య వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ మెట్ల నందకుమార్, సత్తెనపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ కంచర్ల మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జి సర్వేపల్లి అమూల్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన చీరాల కుర్రాడు

- పోటీల్లో నాలుగో స్థానం కైవసం
- ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపిక



దేవరకొండ ప్రేమసాగర్

చీరాల రూరల్: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల క్రీడాకారుడు దేవరకొండ ప్రేమసాగర్ సత్తాచాటాడు. తన ప్రతిభా పాటవాలతో ప్రత్యర్థులను చిత్తుచేసి తన కేటగిరీలో నాలుగో స్థానంలో నిలిచి మన రాష్ట్ర ప్రతిభను ఇనుమడింపచేశాడు.అతని ప్రతిభను గుర్తించిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపిక చేసింది. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 28 నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో ఆల్ ఇండియా జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ (బాలికలు, బాలురు, మెన్ అండ్ ఉమెన్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చీరాల మండలంలోని బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమారుడు దేవరకొండ ప్రేమసాగర్ 81 కేజీల యూత్ విభాగంలో పోటీల్లో పాల్గొన్నాడు. స్నాచ్‌లో 125 కిలోలు బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 150 కేజీలు, ఓవరాల్‌గా 275 కేజీలు బరువు ఎత్తి ఆల్ ఇండియాలో నాలుగో స్థానంలో నిలిచాడు. ప్రేమసాగర్‌ను తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈనెల 25న ప్రారంభం కానున్న ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు సహకారమందించిన రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ టి. దినేష్‌బాబుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్యకు, క్రీడా కోచ్ రమేష్‌కు ప్రకాశం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పున్నారావు, పలువురు సీనియర్ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు జట్టుపై ప్రకాశం జట్టు ఘనవిజయం



ప్రకాశం బ్యాట్స్‌మెన్ రాజ్‌మోహన్‌కు క్రికెట్ డ్రస్ అందిస్తున్న సీసీఎస్ ఎస్ఐ చరణ్

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్రా సెంట్రల్ జోన్ అండర్-14 బాలుర అంతర్ జిల్లాల వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా గురువారం ప్రకాశం, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన ప్రకాశం జిల్లా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 37.2 ఓవర్లలో 92 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని డింకూ 19, టి.విజయ్ 17 పరుగులు చేయగా, ప్రకాశం బౌలర్లు దినేష్ 4 వికెట్లు, సుప్రీత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జిల్లా జట్టు 24.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 93 పరుగులతో విజయం సాధించింది. ప్రకాశం బ్యాట్స్‌మెన్ రాజ్‌మోహన్ అజేయంగా 55 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అద్భుతంగా బ్యాటింగ్ చేసిన రాజ్‌మోహన్‌కు సీసీఎస్ ఎస్ఐ చరణ్ క్రికెట్ డ్రస్ బహుమతిగా ఇచ్చి ప్రోత్సహించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు. శుక్రవారం గుంటూరు, కృష్ణా జిల్లాల మధ్య మూడో మ్యాచ్ జరగనుంది.

ఆర్బీకేల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



కంది పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

శావల్యాపురం: ఇక నుంచి రైతుభరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు చేస్తున్నట్లు నరసరావుపేట డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని గుంటుపాలెం గ్రామం రైతు భరోసా కేంద్రంలో కంది పంట సాగు చేసిన రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో కంది పంట పొలాలను క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ శావల్యాపురం మండలంలో కంది పంట 2 వేల ఎకరాలలో సాగు చేశారని, రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా పంట సాగు చేయటం ద్వారా ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో క్వింటా కందులు రూ.7500 కొనుగోలు చేస్తామని, అలాగే రైతులకు గోనె సంచులు, కూలీల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉందని తెగుళ్లు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారులు ఏడీఏ బీవీ శివకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, ఏఓ పి.ప్రవీణ్, రైతుభరోసా సహాయకులు రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వ తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న రవి ప్రకాష్ రెడ్డి

- చిత్తశుద్ధితో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం
- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తోడ్పాటు అందించటానికి అవసరమైన అన్ని కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలుచేస్తోందనీ, వీటిని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహ అవరణలో లూయి బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంధులు విద్యను అభ్యసించటానికి ప్రత్యేక లిపిని రూపొందించిన లూయి బ్రెయిలీ స్ఫూర్తి ప్రదాతా అని, చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని కొనియాడారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు కుటుంబ సహకారం అందిస్తే వారు ఆత్మవిశ్వాసంతో ఇతరులకు ఆదర్శంగా జీవిస్తారన్నారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం అమల్లో భాగంగా రూల్స్‌ను సిద్ధం చేయటం జరిగిందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ టి.లీలావతి మాట్లాడుతూ బ్రెయిలి లిపి అందుబాటులోకి రావటం వలనే ప్రపంచ వ్యాప్తంగా అంధులు విద్యను అభ్యసించటం సాధ్యమైందన్నారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అందించే సేవలను అంధులకు అవగాహన కల్పించటానికి బ్రెయిలీ లిపితో రూపొందించిన పత్రాలను రూపొందించి అందించటం జరుగుతుందన్నారు. జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమే మనస్సు కాదని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదల, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం విద్యా, ఉద్యోగం, ఉపాధికి అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో విజయవంతం కావాలన్నారు. ముందుగా బ్రెయిలి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రెయిలీ లిపితో రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, కార్పొరేటర్ పద్మశ్రీ, దివ్యాంగుల సంక్షేమ సంఘాల నాయకులు హనుమంతరావు , రామకృష్ణా రెడ్డి, సుబ్బారావు, గుమ్మడి సుబ్బారావు, బాజీ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర రెడ్డి, అంకమ్మ రావు, శ్రీనివాసరావు, జాన్ సైదా, రాధా రెడ్డి, రాజా రెడ్డి, నారాయణ రెడ్డి, అంజనీయులు, అనిల్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

కొలకలూరులో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక డ్రైవ్



కొలకలూరులో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తెనాలిటౌన్: కొలకలూరులో పారిశుద్ధ్య పనులను ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి ఆదేశించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గత నెల 24 నుంచి విధులకు హాజరు కావడం లేదు. దీంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలపై గ్రామస్తులు కొందరు కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో శ్రీదేవి గురువారం గ్రామానికి వచ్చారు. పలు సెంటర్లలో పేరుకుపోయి ఉన్న చెత్త చెదారాలను పరిశీలించారు. చెత్త తొలగించే పనులను డీఎల్‌పీవో స్వరూపరాణి కార్మికులతో చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో డీపీవో పంచాయతీ సిబ్బంది, అధికారులతో మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్, పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శికి మధ్య జరిగిన గొడవల గురించి వాకబు చేశారు. బిల్లులు మంజూరు, పారిశుద్ధ్య కార్మికుల బిల్లుల విషయంపై సర్పంచ్, కార్యదర్శి మధ్య వివాదం జరిగిందని సిబ్బంది, పంచాయతీ వార్డు సభ్యులు డీపీవోకు వెల్లడించారు. అనంతరం డీపీవో శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో మేజర్ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పనులకు వాడుకోవాలని ఆదేశాల జారీ చేస్తామన్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేయాలని, చెత్త, చెదారం తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లించాలని ఆదేశించారు. విధులకు హాజరయ్యే కార్మికులు వారి వివరాలు నమోదు చేయాలని, హాజరు కాని వారికి నోటీసులు ఇవ్వాలని కార్యదర్శికి సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ సుభాష్ చంద్రబోస్, ఇన్‌చార్జ్ కార్యదర్శి సూరపనేని కల్పన, వార్డు సభ్యులు రావూరి రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.